క్లుప్తంగా

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెండో విడత ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకూ మొదటి విడత శిబిరాలు నిర్వహించారు. రెండో విడతగా 8 నుంచి 11 వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు ఎంపీడీఓ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అద్దంకివారిలంక, మాచర, నల్లూరు, 9న కేదారిలంక, మాచర, నల్లూరు, 10న తాతపూడి, టేకి 2, వెదురుమూడి, 11న కపిలేశ్వరపురం-2, టేకి 2, వెదురుమూడి సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రామాలయం ప్రారంభం



రామాలయాన్ని ప్రారంభిస్తున్న వీర్రాజు మాస్టారు

మండపేట: పెద్ద గొల్లపుంతలో ఐఎస్‌డీ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో నిర్మించిన రామాలయాన్ని శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు అద్దంకి వీర్రాజు మాస్టారు దంపతులు రిబ్బన్ కట్ చేసి రామాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. మరోదాత ఇనపకోళ్ల సత్యనారాయణ విరాళంతో రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాసిన కాశీ విశ్వనాథం, విజ్ఞాన్ రాంబాబు, నల్లబ్బు, సంకా శ్రీనివాసరంగా, బిక్కిన చక్రవర్తి, పోతంశెట్టి సత్తిబాబు, చింతా వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మహిళల ఆందోళనకు కామన మద్దతు



సంఘీభావం తెలుపుతున్న కామన ప్రభాకరరావు

మండపేట: జనావాసాల నడుమ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ గత 17 రోజులుగా సత్యశ్రీ రోడ్డులో రిలే దీక్షలు చేస్తున్న 28, 29, 30 వార్డుల మహిళలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ చైర్మన్ కామన ప్రభాకరరావు మద్దతు తెలిపారు. ఆదివారం ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు తలచుకుంటే మద్యం షాపు తీయించడానికి ఐదు నిమిషాల సమయం చాలన్నారు. అలా చేయకుండా ముందొకమాట వెకకొక మాట చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి షాపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇంటింటికీ మద్యం షాపు తేవాలన్న యోచనలో ఉందని ఎద్దేవా చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక నివాస ప్రాంతాల మధ్యకు వైన్‌షాపులు వచ్చాయన్నారు. జనావాసాల నడుమ మద్యం షాపు వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, మూడు వార్డుల మహిళలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలను అరికట్టాలి



ఇసుక ర్యాంపు అక్రమాలపై మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరెడ్డి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంకలో ఉచిత ఇసుక తవ్వకాలు పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే ర్యాంపును నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ వీధి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వీడియో సందేశాన్ని విడుదల చేశారు. శనివారం కేదారిలంక ఇసుక ర్యాంపు వద్ద కొత్తపేటకు చెందిన యువకుడు ఇసుక గుంతల్లో గల్లంతై చనిపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇల్లు నిర్మించుకొనేవారికి ఉచితంగా ఇసుక ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవానికి ఇసుకను ఉచితంగా ఇవ్వడం లేదని, ట్రాక్టరు ఇసుకను రూ.900 నుంచి రూ.1500 వరకూ అమ్ముతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు జరపడంతో ప్రమాదాలు జరిగి యువకులు బలైపోతున్నారన్నారు. వీధివారిలంకలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన ధనమ్మమర్రి ఉండటంతో గోదావరి నదిలో భక్తులు స్నానాలు చేస్తారన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలతో ఆ ప్రాంతం కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను తవ్వకోమన్నదాన్ని ఆసరా చేసుకొని అక్రమాలకు పాల్పడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ర్యాంపును నిలుపుదల చేయకపోతే గ్రామం నదీ గర్భంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సర్పంచ్ వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.



ద్రాక్షారామ మార్కెట్‌లో సీతారాముల కల్యాణం



సత్యవాడలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



సత్యవాడలో కాగిత పువ్వులతో ఏర్పాటు చేసిన చలువపందిళ్లు



వెలంపాలెం వేద పాఠశాల వద్ద చలువ పందిరిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

చూసిన కనులకు వైభోగం

- కన్నులపండువగా సీతారాముల కల్యాణం
- వీక్షించిన భక్తులు
- వాడవాడలా అన్నదానాలు

కె.గంగవరం: సీతారాములు కల్యాణమూర్తులుగా దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సీతారామాలయాల వద్ద ఉదయం నుంచి సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులతో కలసి ఆలయాల వద్ద పూజలు చేసి స్వామివారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. యర్రపోతవరం, సత్యవాడ, పామర్రు, అముజూరు, కె.గంగవరం, దంగేరు తదితర గ్రామాల్లో అన్నదానాలూ నిర్వహించారు.

అంగరంగ వైభవంగా..

మండలంలోని సత్యవాడలో గత 130 ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాలకు అనుగుణంగా ఈ ఏడాది కూడా స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నాలుగు ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలోని మండపాల వద్ద కల్యాణం కమనీయంగా నిర్వహించారు. నాలుగు చోట్ల భద్రాదిలో స్వామివారికి నిర్వహించే అభిజిత్ ముహూర్తానికే స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామివారు, అమ్మవార్ల కోసం ప్రత్యేకంగా అలంకరించిన కొబ్బరికాయలు ఆకట్టుకున్నాయి. ప్రతి కుటుంబం వారి బంధువులతో కలసి మండపాల వద్ద ఆశీనులై స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. స్వామి వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు, రామచంద్రాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామి వారి కల్యాణాన్ని తిలకించి దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న చలువపందిళ్లు

నెల రోజుల ముందు నుంచే గ్రామంలో ప్రతి కుటుంబం సొంతంగా కాగితపు పువ్వులను తయారు చేస్తారు. వీటిలో సీతారాముల ఆలయం వద్ద చలువపందిళ్లను ఏర్పాటు చేసి వాటిలో అమర్చారు. వీటిని చూడడానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సత్యవాడ చేరుకుని తిలరించారు. విద్యుత్ దీపాల మధ్య కాగితపు పువ్వులు ఆహుతులను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం సాయంత్రం గ్రామంలో గారడీలు, గరగన్రృత్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు, చుట్టుపక్కల మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు తరలించారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. రామాలయాల ఎదుట చలువపందిళ్లు వేసి పచ్చని మామిడితోరణాలు, విద్యుత్‌దీపాలంకరణలతో సుందరంగా అలంకరించారు. గ్రామగ్రామానా సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామివార్ల ఉత్సవ విగ్రహాలను బాజాభజంత్రీలతో, బాణసంచా కాల్పులతో పుర వీధుల్లో ఊరేగించారు. సీతారాములను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. పలుచోట్ల రామాలయాల వద్ద భారీ ఎత్తున అన్నదానాలు నిర్వహించగా దాదాపు అన్ని రామాలయాల వద్ద పానకం, చలివిడి వడపప్పు పంపిణీ చేసి, ప్రసాదం వితరణ చేశారు.



సత్యవాడలో స్వామివారి కల్యాణాన్ని తిలకించదానికి వస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్

పలు గ్రామాల్లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం చలువ పందిళ్లు వేసి చల్లని రామయ్య కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కన్నులారా తిలకించగా సీతారాముల కల్యాణం వేద మంత్రాల నడుమ కమనీయంగా నిర్వహించారు. భక్తులకు బెల్లం పానకం, వడపప్పు ప్రసాదంగా అందజేశారు. తాళ్లపాలెం, జగన్నాయకులపాలెం, వెలంపాలెం, నరసాపురపుపేట, యనమదల, భీమక్రోసుపాలెం తదితర గ్రామాల్లో రాములోరి కల్యాణ క్రతువులు నిర్వహించారు.

ద్రాక్షారామలోని మార్కెట్‌లో..

గ్రామంలోని మార్కెట్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో 1955 నుంచి సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. సీతారామ బాలభక్త సమాజం (వర్తక సంఘం) ఆధ్వర్యంలో సమయమంతుల సతీష్, సౌమ్య దంపతులతో శ్రీరామచంద్రమూర్తి, సీతామహాలక్ష్మి అమ్మవార్ల దివ్య కల్యాణం వేద పండితులు మేడవరపు చింతామణి వేద మంత్రోచ్ఛారణల మధ్య కమనీయంగా నిర్వహించారు.

వెలంపాలెం వేద పాఠశాలలో..

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, చంద్రశేఖర భారతీస్వామి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పాఠశాల ఆవరణలో బులుసు సోమనాథ శాస్త్రి, శేషమ్మ దంపతుల స్మారక సభావేదికపై మైలవరపు మృత్యుంజయ శాస్త్రి (చోడయ్య) బ్రహ్మత్వంలో సీతారామ కల్యాణ మహోత్సవం అశేష భక్తుల మధ్య కన్నులపండువగా నిర్వహించారు. ముందుగా ఉదయం నాదస్వరం, మీనాక్షీ సమేత సోమసుందరేశ్వర చర పంచాయతనమునకు మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సీతారాముల నగరోత్సవం జరిపించారు. ఉప్పులూరి కృష్ణమూర్తి, రత్నమాణిక్యం చావలి అనిల్‌కుమార్‌మిత్ర శర్మ, వైజయంతి దంపతులతో కల్యాణం నిర్వహించారు. రాత్రి సీతారామచంద్రమూర్తి సామ్రాజ్య పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాష్ట్ర మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మండపేట: శ్రీరామనవమి వేడుకలు మండపేట పట్టణ, రూరల్ పరిధిలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రామాలయాల వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచి చిన్నలు, పెద్దలు, మహిళలు, యువత రామాలయాలకు పోటెత్తారు. జైశ్రీరామ్ నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. కేపీరోడ్డులో మండపేట టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వింజరపు శ్రీనివాస్, కోశాధికారి బీరక సాంబశివరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. బురుగుంట చెరువు సీతారామక్షేత్రం, గొల్లపుంత రామాలయం, రావులపేట, తర్వాణీపేట, హరిజనపేట, పాటిమీద, నాయుళ్ల గుడి వద్ద, తూర్పుకాపు, వెలమనాగవంశీయుల రామాలయం, వల్లూరి వారి వీధి, ధర్మగుండం చెరువు, కొండపల్లి వారి వీధిలోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. గొల్లపుంతలో రెండు వేల మందికి అన్నదానం చేయగా, సీతారామ క్షేత్రం, శెట్టిబలిజ రామాలయాల వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.



మండపేట గొల్లపుంతలో స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళలు



మొగలిపాలెంలో అన్న సమారాధన



రాయవరం శెట్టిబలిజ రామాలయం వద్ద స్వామివారి కల్యాణం

కపిలేశ్వరపురం: శ్రీరామనవమి వేడుకలు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆదివారం కన్నులపండువగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయాల్లో దశరథమహారాజు కుమారుడు రాముడికి, జనకమహారాజు కుమార్తె సీతాదేవికి భక్తుల సమక్షంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, తాతపూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో స్వామివారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆలయాలను సందర్శించి దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం కళాకారులు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాములవారిని కీర్తిస్తూ భక్తి గీతాలను ఆలపించారు. పలు గ్రామాల్లో మహిళా కళాకారులు కోలాటాన్ని ప్రదర్శించారు. ఆలయాల వద్ద పానకం ప్రసాదంగా అందజేశారు. ఆలయాలు వద్ద ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

రాయవరం: మండలంలోని రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, మాచవరం, పసలపూడి, నదురుబాద, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. తొమ్మిది గంటల నుంచి స్వామివారి వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీరామచంద్రుడు, సీతాదేవి వంశాలను వివరిస్తూ..తన పరాక్రమంతో శివధనస్సు విరిచి సీతాదేవిని పరిణయమాడిన కమనీయమైన కల్యాణ ఘట్టాలను పలు ఆలయాల్లో పురోహితులు వివరించారు. మా ఊరి దేవుడు..అందాల రాముడు అంటూ..శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. పలు రామాలయాల వద్ద భారీగా అన్న సమారాధన నిర్వహించారు.

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం

మండపేట: పట్టణంలో ఫ్రెండ్స్ ఎన్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐఎస్‌డీ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఐఎస్‌డీ ఫౌండేషన్ తరఫున ఏటా మూడు నెలల పాటు మజ్జిగ చలివేంద్రం ద్వారా ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చుతారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా కలువపువ్వు సెంటర్ దుర్గమ్మ గుడి ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారికి చదువు చెప్పిన గురువు అద్దంకి వీర్రాజు మాస్టార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీరామ నవమి సందర్భంగా తొలిరోజు స్వామివారి పానకాన్ని పంపిణీ చేశారు. ఐఎస్‌డీ, ఫ్రెండ్స్ ఎన్ ఫ్రెండ్స్ సభ్యులను వీర్రాజు మాస్టార్ అభినందించారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు కాసిన కాశీ విశ్వనాథం, విజ్ఞాన్ రాంబాబు, పాలకేంద్రం నల్లబ్బు, సంకా శ్రీనివాసరంగా, బిక్కిన చక్రవర్తి, పోతంశెట్టి సత్తిబాబు, చింతా వీరవెంకట సత్యనారాయణ, వంక సత్తిబాబు, ఇమిడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: వేసవిలో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చాలని మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ విజ్ఞప్తి చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడిద రోడ్డులో ఆర్‌ఆర్‌ఆర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీవరప్రకాష్ ప్రారంభించారు. ఏపీఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. కామాక్షీ వడ్రంగి యువజన సంఘం ఆధ్వర్యంలోనూ చలివేంద్రం ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ తామరపల్లి భాస్కరరావు, తాళాబత్తుల ప్రభాకరరావు, గోడి నరసింహమూర్తి, ర్యాలి బ్రహ్మం, గొర్తి గోపాలం తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బాలరాముడి విగ్రహం ఏర్పాటు



పసలపూడిలో ఏర్పాటు చేసిన బాలరాముడి విగ్రహం

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఆదివారం బాలరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న శ్రీసిటీలో బాలరాముడి విగ్రహాన్ని తాడి శ్రీనివాసరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో బాలరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, ప్రగతి రామారెడ్డి, రైసుమిల్లర్ల సంఘం నాయకులు మల్లిడి రామ్మూర్తి రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, చింతా సాయిరెడ్డి పాల్గొన్నారు.

మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారం

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన అంతర్జాతీయ మెజీషియన్ అలీ ఉగాది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ సిటీ సెంట్రల్ కోర్టు హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ సంగమం ఫౌండేషన్ మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారం అందించి సత్కరించింది. ఫౌండేషన్ అధ్యక్షులు సంజయ్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ సినీ నటులు తనికెళ్ల భరణి, వై.విజయ, దర్శకుడు రేలంగి నరసింహారావు మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారాన్ని అందించారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- దేవాలయం భూముల్లో సైతం అక్రమ తవ్వకాలు
- భూమి చదును పేరుతో మట్టి తరలింపు
- లే అవుట్లకు తరలిపోతున్న మట్టిదిమ్మలు

కాజులూరు: గోదావరి నదీ తీరానికి ఆనుకుని ఉన్న కాజులూరు మండల గ్రామాలు ఒకప్పుడు పంట పొలాలు, పొలాల మధ్యలో ఇసుక దిమ్మలు, తోటలతో పచ్చగా కళకళలాడుతుండేవి. కోనసీమకు సరిహద్దు మండలమైనప్పటికీ కొబ్బరి, మామిడి తోటలతో ఆ స్థాయికి ఏ మాత్రం తీసిపోనట్టుగా ఉండేది. అయితే ఇటీవల మట్టిమాఫియా కళ్లు మండల గ్రామాల్లోని ఇసుక, మట్టి దిమ్మలపై పడటంతో అవి క్రమేపీ కనుమరుగవుతున్నాయి. పుదుచ్చేరి రాష్ట్రమైన యానంతో పాటు సమీపాన ఉన్న రామచంద్రపురం, కాకినాడ తదితర పట్టణాల్లోని లే అవుట్లకు, ఇటుకల బట్టీలకు ఇక్కడి నుంచి ఇసుక, మట్టి తరలిస్తున్నారు. వాస్తవానికి పొలాల్లోనూ, పొలాల మధ్య దిమ్మలపైనా ట్రక్కు మట్టి తీయాలంటే రెవెన్యూ, గనుల శాఖ అధికారుల అనుమతులు ఉండాలి. అయితే కాసులకు కక్కుర్తిపడి స్థానిక అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో మట్టి వ్యాపారం జోరుగా సాగిపోతుంది. మండలంలోని కోలంక శివారు పాలమూరిపాడులో తాళ్లరేవు మండలం కేశవపురం శ్రీ, భూ సమేత కేశవ స్వామివారి ఆలయానికి చెందిన సుమారు వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూములను అనేక మంది రైతులు కౌలుకి సాగు చేసుకుంటున్నారు. అయితే టేకి డ్రెయిన్‌కు చెంతన ఉన్న భూమిలో గతంలో డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ చేయగా వచ్చిన మట్టిని ఆ ప్రాంతంలో వేయడంతో పలు చోట్ల మట్టి దిబ్బలు ఏర్పడ్డాయి. ఆ మట్టి తరలింపునకు గతంలో ప్రభుత్వ వేలం నిర్వహించగా చాలావరకు మట్టిని తరలించి కొంతమేర అలాగే వదిలివేశారు. దీంతో ఆ భూమి సాగు చేసేందుకు అనుకూలంగా లేదని, భూమిని చదును చేయాలని రైతులు అధికారుల వద్ద మొరపెట్టుకోగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మట్టిని తీసివేద్దామని ఈఓ యర్రా వెంకటేశ్వరరావు రైతులకు చెప్పారు. ఆయన మాటలను ఖాతరు చేయకుండా కింది స్థాయి ఉద్యోగి ఒకరు మట్టి మాఫియాతో బేరం కుదుర్చుకుని జేసీబీ, ట్రాక్టర్లతో దేవాలయం భూముల్లో మట్టిని తరలించేందుకు చర్యలు చేపట్టారు. దీనిపై పలువురు దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈవో పనులను నిలిపివేసి ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండలంలోని ఆర్యావటంలోనూ గొల్ల పాలెం వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 3.5 ఎకరాల మెరక భూమి ఉంది. ఈ భూమిని స్థానికులు కొందరు లీజుకు తీసుకుని ఆకుకూరలు, బీరపాదులు పెట్టి కాయకూరలు పండిస్తుంటారు. అయితే మట్టి మాఫియా కన్ను ఈ దేవాలయం భూమిపై పడటంతో స్థానిక నాయకులతో కుమ్మక్కై, రాత్రి సమయాల్లో రహస్యంగా తవ్వకాలు చేపట్టారు. స్థానికులు గమనించి ఆందోళనలు వ్యక్తం చేయడంతో ఆర్యావటంలోనూ మట్టి తవ్వకాలు తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారులు స్పందించి దేవాలయం భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అక్రమ మట్టి తవ్వకాలు పునః ప్రారంభం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్యావటం నుంచి మట్టి తరలించుకుపోతున్న ట్రాక్టర్



పాలమూరుపాడులో మట్టిని తరలించేందుకు వినియోగిస్తున్న జేసీబీ



దేవస్థానం భూమిలో మట్టి తవ్వకంతో ఏర్పడిన గొయ్యి

గత 15 సం॥లుగా మమ్ములను ఆదరిస్తూ వస్తున్న పరిసర గ్రామ ప్రజలకు, శ్రేయోభిలాషులకు, డాక్టర్ మిత్రులకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలతో...
వరల్డ్ హెల్త్ డే శుభాకాంక్షలు
AKIRA EYE
అకీరా కంటి ఆసుపత్రి
నయన వి క్లినిక్
కన్సల్టెంట్: ఎస్.రెహానా సుల్తానా D.O.A.
సీనియర్ ఆప్టోమెట్రిస్ట్
శివాలయం వీధి, రామచంద్రపురం. సెల్: 99899 40041